


నామినేటెడ్‌పై నజర్

- రాష్ట్ర, జిల్లా స్థాయి పోస్టులపై పలువురి దృష్టి
- జిల్లా గ్రంథాలయ చైర్మన్ పదవికి డిమాండ్
- మార్కెట్ చైర్మన్లు, రైతు సమన్వయ సమితుల కోసమూ ప్రయత్నాలు
- నేతల ప్రసన్నానికి ద్వితీయ శ్రేణి కేడర్ ప్రదక్షిణలు
- పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్‌కు ముందే భర్తీలుంటాయని ప్రచారం

నియామక పదవులపై కాంగ్రెస్ ఉమ్మడి వరంగల్ జిల్లా నేతల ఆశలు



పదేళ్లుగా ఎదురుచూపులే..

కాంగ్రెస్ శ్రేణులకు నామినేటెడ్ పోస్టులను కట్టబెట్టేందుకు పార్టీ అధిష్ఠానం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే ఆయా జిల్లాల నుంచి అర్హుల జాబితాను తయారు చేసినట్టు ప్రచారం జరుగుతోంది. వచ్చే పార్లమెంట్ ఎన్నికలలోపే ఈ పోస్టులు భర్తీ చేస్తే కేడర్ ఉత్సాహంగా పని చేస్తుందని అధిష్ఠానం భావిస్తున్నట్టు సమాచారం. ఈ మేరకు ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లాకు చెందిన మంత్రులు కొండా సురేఖ, అనసూయ సీతక్కతో ఇప్పటికే నామినేటెడ్ పోస్టుల భర్తీ విషయమై చర్చించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో త్వరలోనే నామినేటెడ్ పదవుల భర్తీ ఉంటుందనే ప్రచారం ఆశావహుల్లో ఉత్కంఠ రేపుతోంది.

వరంగల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : కాంగ్రెస్‌లో నామినేటెడ్ పోస్టుల భర్తీపై ఉత్కంఠ కొనసాగుతోంది. పదేళ్ల తరువాత కాంగ్రెస్ అధికారంలోకి రావటంతో రాష్ట్ర, జిల్లా స్థాయిలో కీలక పదవులపై నేతలు దృష్టి పెట్టారు. సుదీర్ఘకాలం గా కాంగ్రెస్‌లో పని చేస్తున్న నేతలతోపాటు గత అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ దక్కని వారికి నామినేటెడ్ పదవులతో సంతృప్తి పరిచేందుకు కాంగ్రెస్ అధిష్ఠానం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే ఆయా నియోజకవర్గాల్లో నామినేటెడ్ పదవులను ఎవరెవరికి ఇవ్వాలో కాంగ్రెస్ అధిష్ఠానం ఓ జాబితాను సిద్ధం చేసినట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో కీలకమైన పోస్టులను దక్కించుకునేందుకు నేనియర్లు అధిష్ఠానం పెద్దల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. దీంతో ఎవరికి ఏ పదవి దక్కుతుందోనన్న చర్చ జరుగుతోంది.

రాష్ట్రస్థాయి పదవులపై ఆశలు

సుదీర్ఘకాలంగా పార్టీలో పనిచేస్తున్న నేతలకు సముచిత స్థానం కల్పించాలని అధిష్ఠానం నిర్ణయించినట్టు వస్తున్న సమాచారంతో గత అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ దక్కని నేతలు తమకు రాష్ట్రస్థాయిలో చైర్మన్ పదవులు కావాలని ఒత్తిడి తెస్తున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే మహబూబాబాద్ జిల్లాకు చెంది న మాజీ ఎమ్మెల్యే వేంనరేందర్‌రెడ్డిని సీఎం రేవంత్ రెడ్డి ప్రధాన సలహాదారుడిగా నియమించడంతో మిగతా నేతలకు కూడా కీలక పదవులపై ఆశలు చిగురిస్తున్నాయి. జనగామ నుంచి పోటీ చేసి ఓడిపోయిన కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, వరంగల్ మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణలతో పాటు గత ఎన్నికల్లో పరకాల టికెట్ ఆశించిన మాజీ మావోయిస్టు, భూపాలపల్లికి చెందిన టీపీసీసీ అధికార ప్రతినిధి గాజర్ల అశోక్ అలియాస్ ఐతూ, ఆత్మకూరుకు చెందిన ఇనుగాల వెంకట్రామ్ రెడ్డి, వర్ధన్నపేట టికెట్ ఆశించిన నమిండ్ల శ్రీనివాస్ తదితరులు రాష్ట్రస్థాయిలో కార్పొరేషన్ చైర్మన్ పదవులను ఆశిస్తున్నారు. వీరితోపాటు వరం గల్ ఎంపీ టికెట్ రేసులో ఉన్న మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, జంగా రాఘవరెడ్డి కూడా రాష్ట్రస్థాయి పదవుల కోసం పట్టుపడుతున్నారని సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా 54 నామినేటెడ్ పోస్టులు ఉండగా, ఉమ్మడి వరంగల్ నుంచే అత్యధికంగా పోటీ పడుతుం డటం అధిష్ఠానానికి ఒకింత పరీక్షగా మారిందన్న అభిప్రాయాలున్నాయి. ఈ క్రమంలో ఎవరికి రాష్ట్రస్థాయిలో పదవులు ఇవ్వాలో అనేదానిపై మంత్రులతో చర్చిస్తున్నట్లు తెలుస్తోంది.

జిల్లా చైర్మన్ పదవులు దక్కేదెవ్వరికో?

నామినేటెడ్ పోస్టుల కోసం కాంగ్రెస్ పార్టీలో తీవ్ర పోటీ నెలకొంది. వరంగల్, హనుమకొండ జిల్లాల నుంచి బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఈవీ శ్రీనివాస్, మీసాల ప్రకాష్, బత్తిని శ్రీనివాస్, ఎండీ అజీజ్‌ఖాన్, అయూబ్ఖర్, రవళిరెడ్డి, పాల్వాయి శ్రీనివాస్, రంజిత్‌రెడ్డి తదితరులు పోటీలో ఉన్నట్లు సమాచారం. వీరితో పాటు మరికొంత మంది సీనియర్ నేతలు మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్‌నాగరాజు, దొంతి మాధవరెడ్డి, రేవూరి ప్రకాష్‌రెడ్డిపై నామినేటెడ్ పోస్టుల కోసం ఒత్తిడి తీసుకొస్తున్నారు. అలాగే జనగామ జిల్లా నుంచి సుధాకర్, వి.సత్యనారాయణరెడ్డి, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ ధన్వంతి ఖర్త లక్ష్మీనారాయణనాయక్, ముత్తినేని సోమేశ్వర్‌రావు, ఎస్.ప్రవీణ్‌రావు, మహబూబాబాద్ జిల్లా నుంచి బెల్లయ్యనాయక్, భరత్‌చంద్రారెడ్డి, నూనవాత్ రాధ తదితరులు రాష్ట్ర, జిల్లా స్థాయిలో నామినేటెడ్ పదవులను ఆశిస్తున్నారు. భూపాలపల్లి, ములుగు జిల్లాల నుంచి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఐతే ప్రకాష్, సినీ డైరెక్టర్ దామోదర్‌గౌడ్, అప్పం కిషన్, రాంనర్సింహరెడ్డి, ములుగు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్, గొల్లపల్లి రాజేందర్ తదితరులు నామినేటెడ్ పోస్టుల రేసులో ఉన్నారు.

ఈ పదవులపైనే నేతల కన్ను

జిల్లా స్థాయిలో నామినేటెడ్ పోస్టులను ఆశిస్తున్న నేతలు కీలక పదవులపై దృష్టిసారించారు. ముఖ్యంగా వరంగల్ నగరంలోని కూడా పోస్టుపై కీలక నేతలు కన్నేశారు. అత్యంత కీలకమైన పదవి కావటంతో కాంగ్రెస్‌లోని ముఖ్యనేతలు కూడా చైర్మన్ పదవి ఆశిస్తున్నారు. జంగా రాఘవరెడ్డి, ఎర్రబెల్లి స్వర్ణ, ఈవీ శ్రీనివాస్, బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి లాంటి కీలక నేతలు కూడా చైర్మన్ పదవి ఆశిస్తున్నారనే చర్చ జరుగుతోంది. ఇక వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ చైర్మన్‌పదవిపై కూడా కీలక నేతలు ఆశిస్తున్నారు. అలాగే జిల్లాల్లో అత్యంత కీలకమైన పదవిగా జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ పదవిపై ఎక్కువ మంది ఆశిస్తున్నారు. నెలనెల వేతనంతో పాటు వాహనం అలవెన్స్ కూడా ఇస్తుండటంతో ఎక్కువమంది గ్రంథాలయ చైర్మన్ పదవిపై ఆశతో ఉన్నారు.

అలాగే గత ప్రభుత్వం తీసుకవచ్చిన రైతు సమన్వయ సమితిలపై సందిగ్ధం కొనసాగుతోంది. ఈ పదవులను ప్రస్తుత ప్రభుత్వం కొనసాగిస్తుందా? లేదా అనేది చర్చనీయాంశంగా మారింది. ఈ పదవులను కొనసాగిస్తే జిల్లా సమన్వయ సమితి అధ్యక్ష పదవితో పాటు మండల స్థాయిలోనూ కమిటీలతో చాలా మందిని నామినేటెడ్ పోస్టుల్లో భర్తీ చేసే అవకాశం ఉంది. వీటితో పాటు జిల్లా కేంద్రాలతో పాటు ముఖ్యపట్టణాల్లో ఉన్న వ్యవసాయ మార్కెట్లు, దేవాలయాల చైర్మన్ పదవులపై కూడా నేతలు దృష్టి సారించారు. మొత్తానికి పదేళ్ల తరువాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌పార్టీలో నామినేటెడ్ పదవుల జోష్ నెలకొంది.

పొలం బాట వివాదంలో అన్న హతం

- కరెంట్ ఉచ్చుతో చంపిన తమ్ముడు
- ప్రమాదంగా చిత్రీకరించే కుట్ర
- పోలీసుల దర్యాప్తులో వెల్లడి
- మల్లంపల్లి శివారు రాజుపల్లిలో ఘటన

ములుగు, ఫిబ్రవరి 2 : పొలానికి వెళ్లే బాట విషయంలో తోడబుట్టిన అన్నదమ్ముల మధ్య తలెత్తిన వివాదం హత్యకు దారితీసింది. కరెంటు ఉచ్చుతో అన్నను హత్య చేసిన తమ్ముడు, అతని భార్య ప్రమాదంగా చిత్రీకరించే కుట్ర చేశారు. పోలీసుల దర్యాప్తులో విషయం బహిర్గతం కాగా నిందితులు జైలుకు వెళ్లారు. ములుగు మండలం మల్లంపల్లి శివారు రాజుపల్లిలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి


భిక్షపతి (ఫైల్)

సీఐ రంజిత్‌కుమార్ తెలిపిన వివరాలివిధంగా ఉన్నాయి. కావటి భిక్షపతి, అతని తమ్ముడు సుధాకర్‌కు తల్లిదండ్రుల వారసత్వంగా రెండున్నర ఎకరాల చొప్పున వ్యవసాయ భూమి సంక్రమించింది. అయితే దారి విషయంలో ఇరువురి మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. పలుమార్లు పెద్దమనుషుల సమక్షంలో పంచాయతీ కూడా జరిగింది. తన పొలంలో మొక్కజొన్న పంటను సాగు చేస్తున్న భిక్షపతి అడవి పందుల నుంచి రక్షణ కోసం జీ వైరుతో చేను చుట్టూ విద్యుత్ తీగలను అమర్చాడు. పగటి వేళ విద్యుత్ సరఫరాను నిలిపివేసి రాత్రి సమయంలో మాత్రమే కనెక్షన్ ఇచ్చేవాడు. అన్నపై కోపంగా ఉన్న సుధాకర్ అతన్ని హత్య చేసేందుకు ఇదే అదనుగా భావించాడు. ఈ నెల 1వ తేదీన ఉదయం ఆ వైరుకు కరెంటు కనెక్షన్ ఇచ్చాడు. మధ్యాహ్నం చేను వద్దకు వచ్చిన భిక్షపతి నీళ్ల పారించే క్రమంలో వైర్లు తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మరణించాడు. భర్త మరణంపై అనుమానం వ్యక్తం చేసిన భిక్షపతి భార్య సుజాత ములుగు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దర్యాప్తు చేసిన ఎస్సై వెంకటేశ్వర్లు కావటి సుధాకర్, ఆయన భార్య రాధికను విచారించగా నేరం ఒప్పుకు న్నారు. దీంతో వారిని శుక్రవారం అరెస్టుచేసి హత్య కేసు నమోదు చేశారు. అనంతరం కోర్టులో హాజరుపర్చారు. కాగా, మృతునికి భార్యతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

సైన్స్ పరికరాలను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్‌హై


పరికరాలను పంపిణీ చేస్తున్న డీఈవో అబ్దుల్‌హై

ములుగు కలెక్టరేట్, ఫిబ్రవరి 2: సూర్యకిరణ్ వెల్ఫేర్ సొసైటీ అందించిన సైన్స్ పరికరాలను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్‌హై అన్నారు. శుక్రవారం ములుగు జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యా ర్థులకు అర్థవంతంగా సైన్స్‌లో ప్రయోగాత్మకంగా బోధించి అన్ని విష యాల పట్ల అవగాహన కల్పించాలన్నారు. దీంతో విద్యార్థులు పాఠ్యాం శాలను సంపూర్ణంగా అవగాహన చేసుకునే అవకాశం ఉంటుందని అన్నారు. అనంతరం సూర్యకిరణ్ వెల్ఫేర్ సొసైటీ సమకూర్చిన సైన్స్ పరికరాలను సైన్స్ ఉపాధ్యాయులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ క్వాలిటీ కోఆర్డినేటర్ బద్దం సుదర్శన్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి అప్పని జయదేవ్, డీసీఈబీ కార్యదర్శి విజయమ్మ, ఎంఈవో సామల శ్రీనివాసులు, రిసోర్స్‌పర్సన్లు శిరుప సతీష్‌కుమార్, దాస్యప వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మేడారంలో ముమ్మరంగా విద్యుత్ పనులు

- జాతరలో నిరంతరాయ సరఫరాకు ప్రత్యేక చర్యలు
- రూ.16 కోట్లతో పనులు.. ఇప్పటికే 99 శాతం పూర్తి
- సీజీఎం, ఇన్‌చార్జ్ డైరెక్టర్ (ఆపరేషన్స్) మోహన్‌రావు



7

స్వచ్ఛ మేడారం కోసం కృషి చేయాలి

- జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య


పనులను పరిశీలిస్తున్న డీపీవో వెంకయ్య

మేడారం, ఫిబ్రవరి 2 : తాడ్వాయి మండలం మేడారం మహా జాతరను స్వచ్ఛ మేడారంగా జరుపుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య అన్నారు. స్థానిక హరిత హోటల్ కాటేజీలను వీవీఐపీల విడిది కోసం శుభ్రం చేయించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో సమ్మక్క, సారలమ్మలు వెలిశారని తెలిపారు. పర్యావరణాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. 2024 మహా జాతరను అందరం కలిసి ప్లాస్టిక్ ఫ్రీ, స్వచ్ఛ మేడారంగా జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో సత్యాంజనేయప్రసాద్, ఏటూరునాగారం ఐటీడీఏ పెసా కోఆర్డినేటర్ కొమరం ప్రభాకర్, పెసా మొబిలైజర్లు పాల్గొన్నారు.

జాతరలో ఎయిర్‌టెల్ సేవలు

- టవర్లను ప్రారంభించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి


టవర్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

మేడారం, ఫిబ్రవరి 2 : మేడారం సమ్మక్క, సారలమ్మ మహా జాతరను పురస్కరించుకొని ప్రైవేటు సెల్యూలార్ సంస్థ ఎయిర్‌టెల్ టవర్లను జాతర పరిసరాల్లో ఏర్పాటు చేయగా శుక్రవారం కలెక్టర్ ఇలా త్రిపాఠి ఇండస్ టవర్స్ సీఈవో దిలీప్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మేడారం ప్రాంతంలో శాశ్వత ప్రాతిపదికన నిరంతరం ఎయిర్‌టెల్ సేవలు అందించడం కోసం మేడారం, ప్రాజెక్టునగర్, ఎలుబాక ప్రాంతాలలో మూడు టవర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటితో పాటు మహాజాతర సమయంలో మరో 12 తాత్కాలిక టవర్లను ఏర్పాటు చేసి భక్తులకు సేవలు అందిస్తామని సీఈవో దిలీప్‌కుమార్ తెలిపారు. అనంతరం మేడారంలోని హరిత హోటల్ మరమ్మతుల పనులతో పాటు ఊరట్టం నుంచి కాల్వపల్లి బైపాస్ రహదారి, కొంగలమడుగు నుంచి చింతల్ క్రాస్ వరకు జరుగుతున్న పనులను కలెక్టర్ ఇలా త్రిపాఠి పరిశీలించారు. త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ ఈఈ అజయ్‌కుమార్, తహసీల్దార్ రవిందర్, ఏరియా మేనేజర్ రమేష్‌బాబు పాల్గొన్నారు.

ప్రత్యేకాధికారులు సమర్థవంతంగా పనిచేయాలి

- కలెక్టర్ భవేష్ మిశ్రా


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ భవేష్ మిశ్రా

భూపాలపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 2: గ్రామ పంచాయతీలకు నూతనంగా నియమితులైన ప్రత్యేకాధికారులు విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలని కలెక్టర్ భవేష్ మిశ్రా ఆదేశించారు. శుక్రవారం భూపాలపల్లిలోని కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రత్యేక అధికారులతో మాట్లాడుతూ గ్రామ సర్పంచుల పదవీకాలం ముగియడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని 241 గ్రామ పంచాయతీలకు ప్రత్యేకాధికారులను నియమించినట్లు తెలిపారు. అధికారులు పంచాయతీల్లో చేయాల్సిన పనులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్స్, కార్యదర్శి, ఎంపీవో, ఎంపీడీవో, మండల ప్రత్యేక అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రతి 15 రోజులు, నెల రోజులకోసారి గ్రామసభలు నిర్వహించాలన్నారు. మార్చి నెల నాటికి ఇంటి పన్నులను వంద శాతం పూర్తి చేయాలన్నారు. సర్పంచులు ఉపయోగించిన చెక్ బుక్కులు, ఎంబీ రికార్డులను పంచాయతీ కార్యదర్శులు జాగ్రత్తగా భద్రపరచాలన్నారు. సర్పంచులకు ఉండే పూర్తి బాధ్యతలు ప్రత్యేకాధికారులకు ఉంటాయని తెలిపారు.

రానున్న వేసవిలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నీటి సరఫరా చేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. గ్రామాల్లో లీకేజీలు ఉన్న తాగునీటి పైపులైన్లను గుర్తించి అరికట్టాలన్నారు. నీటి ట్యాంకులను శుభ్రపర్చి క్లోరినేషన్ జరపాలన్నారు. రిపేర్‌లో ఉన్న బోర్‌వెల్స్ మరమ్మతు చేయాలన్నారు. ఎంపీడీవోలు డిజిటల్ కీ తీసుకొని గ్రామాల్లో సమస్యలను డీపీవో, కలెక్టర్ దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కె.వెంకటేశ్వర్లు, డీపీవో ఆశాలత, మండల ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

అనుమానితులు కనిపిస్తే సమాచారమివ్వండి

- భూపాలపల్లి డీఎస్పీ రాములు


గ్రామస్థులకు సూచనలు చేస్తున్న డీఎస్పీ రాములు

మొగుళ్లపల్లి, ఫిబ్రవరి 2 : గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని భూపాలపల్లి డీఎస్పీ రాములు అన్నారు. మండలంలోని మొట్లపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించి సరైన పత్రాలు, నెంబర్ ప్లేట్లు లేని 22 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. అదేవిధంగా మూడు లీటర్ల గుడుంబాను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ రాములు గ్రామస్థులను సమావేశపరిచి మాట్లాడారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలన్నారు. కొత్తగా అద్దెకు ఉండే వారి వివరాలను సేకరించాలని సూచించారు. అనుమానితులకు ఎవరూ ఇళ్లు కిరాయికి ఇవ్వకూడదని, వాహనాలకు ఎలాంటి పత్రాలు లేకపోయినా సీజ్ చేస్తామని హెచ్చరించారు.

ప్రజలకు పోలీసులు ఎప్పుడు అందుబాటులో ఉంటారనే భరోసా, నమ్మకం కలిగించడం కోసమే కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చిట్యాల సీఐ వేణుచందర్, స్థానిక ఎస్సై మాధవ్‌గౌడ్, చిట్యాల ఎస్సై రమేష్, టేకుమట్ల, రేగొండ, గణపురం ఎస్సైలు సుధాకర్, రవికుమార్, సాంబమూర్తి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదాతల హైరానా..!

- పత్తి విక్రయించేందుకు నానా తంటాలు
- సీసీఐ ద్వారా జరిగే కొనుగోళ్లకు తాత్కాలిక బ్రేక్
- మూడు కేంద్రాల్లో 1,12,463 క్వింటాళ్లు కొనుగోలు
- రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకుంటున్న దళారులు
- ఇటీవల తూకంలో తేడాతో పోలీసులకు అప్పగింత


ఇటీవల రేగొండ మండలం వెంకటేశ్వర్లపల్లిలో దళారులు పత్తి తూకంలో చేసిన మోసాన్ని గుర్తించి వాగ్వాదానికి దిగిన రైతులు

కృష్ణకాలనీ(భూపాలపల్లి), ఫిబ్రవరి 2: ఆరుగాలం కష్టపడి పండించిన పత్తిని విక్రయించుకునేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. ఓవైపు సీసీఐ కేంద్రాల్లో కొనుగోళ్లను తాత్కాలికంగా నిలిపివేయగా.. దళారులు వారి అవసరాన్ని ఆసరాగా చేసుకొని పత్తి కొనుగోళ్లు జరుపుతున్నారు. గ్రామాల్లో రైతుల నుంచి కొనుగోలు చేసి వాహనాల్లో తరలించి విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇటు రైతులు నష్టపోవడమే కాకుండా అటు మార్కెటింగ్ శాఖ ఆదాయానికి గండి పడుతోంది. అయినా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఎలక్ట్రానిక్ కాంటాలు, ఐరన్ బాట్లు, సాధారణ తూకాల్లో దళారుల మాయాజాలంతో రైతులు మోసపోతున్నారు. అసలే దిగుబడి ఆశించిన స్థాయిలో రాక ఆందోళనలో ఉన్న

మిగతా 8వ పేజీలో..

గ్రామాల్లో ప్రత్యేక పాలన షురూ..

- బాధ్యతలు స్వీకరించిన అధికారులు

8

ఇంటర్ యూనివర్సిటీ జూడో జట్టు ఎంపిక


క్రీడాకారులతో ప్రొఫెసర్ వెంకయ్య

కేయూక్యాంపస్, ఫిబ్రవరి 2: ఈ నెల 5,6 తేదీల్లో పంజాబ్ అమృతసర్ గురు నానక్‌దేవ్ యూనివర్సిటీలో జరిగే ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్ 2023-24 ఏడాదికి గాను కాకతీయ యూనివర్సిటీ , స్త్రీ, పురుషుల జూడో జట్టును ఎంపిక చేసి ప్రకటించినట్లు కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్య శుక్రవారం తెలిపారు. జట్టుకు హనుమకొండ జాగృతి డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఎ.రాజేశ్ మేనేజర్‌గా వ్యవహరిస్తారని వెల్లడించారు. ఎంపికైన జట్టును కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి అభినందించారు.

చిందు కళకు గుర్తింపు తెచ్చిన ఘనత సమ్మయ్యదే..

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

దేవరుప్పుల, ఫిబ్రవరి 2: చిందు కళను దేశం గుర్తించే స్థాయికి తీసుకువచ్చిన ఘనత గడ్డం సమ్మయ్యదేనని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. పద్మశ్రీ పురస్కారానికి ఎంపికైన కళారత్న, హంస అవార్డు గ్రహీత, చిందు యక్షగాన కళాకారుడు గడ్డం సమ్మయ్యను శుక్రవారం ఆయన స్వగ్రామమైన దేవరుప్పుల మండలం అప్పిరెడ్డిపల్లెలో మంద కృష్ణ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళను ప్రదర్శించింది చిందు సమాజం అయితే తరతరాలుగా ఆ కళను పోషించింది, గౌరవించింది, కాపాడుకున్నది మాదిగ జాతేనన్నారు. చిందు యక్షగాన కళారూపాలలో సమ్మయ్య కృషి, ప్రతిభను ఆయన ప్రశంసిస్తూ 50ఏళ్ల తపస్సుతో కూడిన తన శ్రమతో, తన కళలతో, నటనతో రంగస్థలపాత్రలతో ప్రజలను అలరించారని కొనియాడారు. సమ్మయ్యకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 2కోట్లు ఇవ్వాలని, కళలను బతికించుకునేందుకు ప్రత్యేక భవనం నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో చిందు హక్కుల పోరాటసమితి జాతీయ అధ్యక్షుడు గజవెల్లి గణపతి, రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం వెంకటేశ్వర్లు, మాదిగ లాయర్ల ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు వీవీ రత్నం, ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి రాగళ్ల ఉపేందర్, జనగామ జిల్లా అధ్యక్షుడు గజవెల్లి వెంకన్న, చిందు విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు గజవెల్లి ప్రతాప్, శరత్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పడమటింటి నర్సింహ, సైదులు, శ్రీనివాస్, యాదగిరి, రాములు, ఏసుపాదం, సమ్మయ్య కుమారులు గడ్డం సోమరాజు, హిమగిరి పాల్గొన్నారు.


అప్పిరెడ్డిపల్లెలో మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ, చిత్రంలో యక్షగాన కళాకారుడు సమ్మయ్య, తదితరులు


మేడారంలో వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు

వనదేవతలకు నిలువెత్తు మొక్కులు

లక్షకు పైగా తరలివచ్చిన భక్తులు ● సందడిగా మేడారం పరిసరాలు


జంపన్నవాగులో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు

మేడారం, ఫిబ్రవరి 2: తాడ్వాయి మండలం మేడారంలో భక్తుల సందడి నెలకొంది. వివిధ రాష్ట్రాలకు చెందిన లక్షకు పైగా భక్తులు శుక్రవారం మేడారం తరలివచ్చి తల్లుల గద్దెలను దర్శించుకున్నారు. సమ్మక్క, సారలమ్మలకు ముందస్తు మొక్కులు చెల్లించుకున్నారు. తొలుత జంపన్న వాగులో పుణ్యస్నానాలు ఆచరించారు. కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. వనదేవతల గద్దెలకు చేరుకొని అమ్మవార్లకు పూలు, పండ్లు, పసుపు కుంకుమ, చీరె, సారె, కొబ్బరికాయలు, నిలువెత్తు బంగారం(బెల్లం) ఇచ్చారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. సుమారు లక్ష మందికి పైగా భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారని ఈవో రాజేంద్రం తెలిపారు. కాగా, మేడారం సమ్మక్క, సారలమ్మలకు మొక్కులు చెల్లించుకోవడానికి తరలివచ్చే భక్తులు నేరుగా తల్లుల గద్దెలను దర్శించుకోలేక పోయామని అసంతృప్తిని వ్యక్తం చేశారు. అలాగే తల్లుల కొంగు బంగారం(బెల్లం)గా భావించే ప్రసాదం దొరకడం లేదని అంటున్నారు. తల్లుల గద్దెలకు సమర్పించిన బంగారం ప్రసాదంగా అందాలని భక్తులు కోరుకుంటున్నారు. మేడారం వస్తున్న భక్తులకు తల్లులను తాకే అవకాశం లేకుండా గద్దెలకు తాళాలు వేసి దేవాదాయ, పోలీసు శాఖ అధికారుల కుటుంబీకులకు మాత్రం ప్రొటోకాల్ దర్శనాలు కల్పిస్తున్నారని పలువురు భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు

బెల్ట్‌షాపులపై టాస్క్‌ఫోర్స్ దాడులు


తాటికొండలో పట్టుకున్న మద్యాన్ని చూపిస్తున్న పోలీసులు

హనుమకొండ క్రైం/స్టేషన్‌ఘన్‌పూర్, ఫిబ్రవరి 2: వరంగల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు రెండు చోట్ల నిర్వహిస్తున్న బెల్ట్‌షాపులపై మెరుపు దాడి చేశారు. ఈ దాడిలో సుమారు రూ.1.27లక్షల మద్యాన్ని పట్టుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ మండలం తాటికొండ గ్రామానికి చెందిన మారపాక కరుణాకర్ అనే వ్యక్తి చాలా కాలంగా ఇంటినే అడ్డాగా చేసుకుని బెల్టుషాపు నిర్వహిస్తున్నట్టు పక్కా సమాచారం అందింది. దీంతో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది కరుణాకర్ ఇంటిపై దాడులు నిర్వహించి సుమారు రూ.1.20లక్షల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి పట్టుకున్న మద్యాన్ని స్టేషన్ ఘన్‌పూర్ పోలీసులకు అప్పగించారు. అదే విధంగా మడికొండ పోలీసు స్టేషన్ పరిధిలో తరాలపల్లిలో బెల్టుషాపుపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. గంగాపురం స్వరూప అనే మహిళ బెల్టుషాపు నిర్వహిస్తున్నట్టు పక్కా సమాచారం అందింది. సిబ్బంది స్వరూప ఇంటిపై దాడులు నిర్వహించి రూ. 6 వేల విలువ గల అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న మద్యాన్ని సంబంధిత పోలీసులకు అప్పగించారు. ఈ దాడులలో టాస్క్‌ఫోర్స్ పోలీసులతో పాటు సివిల్ పోలీసులు పాల్గొన్నారు.

గాంధీభవన్‌లో దరఖాస్తుల సమర్పణ



హైదరాబాద్ గాంధీభవన్‌లో దరఖాస్తు అందజేస్తున్న రామగళ్ల పరమేశ్వర్

హనుమకొండ సిటీ, ఫిబ్రవరి 2: వరంగల్ పార్లమెంట్ టికెట్ ఆశావహులు హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో దరఖాస్తులను సమర్పిస్తున్నారు. గడిచిన రెండు రోజుల్లో కొందరు ఇప్పటికే దరఖాస్తులను అందచేయగా శుక్రవారం మరి కొందరు టికెట్ కోసం అప్లికేషన్‌ను అందచేశారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు నమిండ్ల శ్రీనివాస్, డాక్టర్ పులి అనిల్‌కుమార్, డాక్టర్ రామగళ్ల పరమేశ్వర్‌తో పాటు ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్ హరికోట్ల రవి, విద్యావేత డాక్టరు ఎన్జెల్లి మురళీదర్శన్ తదితర ఆశావహులు దరఖాస్తు చేసుకున్నారు. శనివారం గడువు ముగియనుండడంతో వరంగల్ పార్లమెంట్ టికెట్ రేసులో ఉన్న నేతలు దరఖాస్తులు అందచేసేందుకు సన్నద్ధమవుతున్నారు. రానున్న మూడు రోజుల్లో స్క్రీనింగ్ ప్రక్రియ కూడా ముగియనుండడంతో ఆశావహులు యత్నాలను ముమ్మరం చేశారు. గాడ్‌ఫాదర్లను ఆశ్రయిస్తూ ఢిల్లీలో మకాం వేస్తున్నారు. ఈ నెల 15 నుంచి 18 లోగానే అభ్యర్థుల ప్రకటన పూర్తి చేయాలనే సంకల్పంతో కాంగ్రెస్ అధిష్ఠానం ఉన్నట్లు తెలిసింది. మేడారం జాతరకు ముందే అభ్యర్థులను ఖరారు చేయడం ద్వారా పార్టీకి ప్రయోజనం చేకూరనుందనే అంచనాలు కాంగ్రెస్ నేతల్లో నెలకొన్నాయి.

సీపీని కలిసిన భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ రోహిత్‌రాజు



సీపీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 2: వ్యక్తిగత పని నిమిత్తం వరంగల్ పోలీసు కమిషనరేట్‌కు వచ్చిన భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ రోహిత్‌రాజ్ శుక్రవారం వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝాను కలిశారు. సీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందించారు. శాంతిభద్రతల పరిరక్షణపై ఇద్దరు అధికారులు కాసేపు మాట్లాడుకున్నారు.

మేడారంలో ముమ్మరంగా విద్యుత్ పనులు

- జాతరలో నిరంతర కరెంట్ సరఫరాకు ప్రత్యేక చర్యలు
- పనులను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్న సీఎండీ
- సీజీఎం, ఇన్‌చార్జ్ డైరెక్టర్ (ఆపరేషన్స్) మోహన్‌రావు వెల్లడి

హనుమకొండ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మేడారం సమ్మక్క - సారలమ్మ జాతరలో టీఎస్ ఎన్‌పీడీసీఎల్ విద్యుత్ పనులను ముమ్మరంగా చేస్తోంది. జాతరకు ఇంకా 20 రోజులు మిగిలుండగానే ఇప్పటికే 99 శాతం పనులు పూర్తయ్యాయని చీఫ్ జనరల్ మేనేజర్ (ఆపరేషన్స్), ఇన్‌చార్జి డైరెక్టర్ కూడా అయిన వి.మోహన్‌రావు వెల్లడించారు. మేడారం జాతరలో నిరంతరం విద్యుత్ సరఫరా ఏర్పాట్లు, విద్యుదాఘాత ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలు, సిబ్బంది నియామకం, గత జాతర కన్నా ఈ సారి అదనంగా చేపడుతున్న పనులు తదితర అంశాలపై ఆయన 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

నాలుగు నెలల ముందు నుంచే..

అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడానికి ముందే మేడారం జాతరలో కరెంట్ సరఫరా పనులు మొదలు పెట్టాం. జాతర ప్రాంతంలో పొలాలు ఉండడం, కోతలు పూర్తికాపోవడంవల్ల అక్కడ పనులు చేపట్టడంలో కొంత ఆటంకం ఏర్పడింది. అయినా మొత్తానికి 99 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులను వచ్చే పది రోజుల్లో పూర్తి చేస్తాం. జాతర ప్రాంగణంలో ఇప్పటికే విద్యుత్ సరఫరా పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చింది. గతంలోకన్నా ఈసారి మరిన్ని అదనపు ఏర్పాట్లు చేస్తున్నాం. జాతరలో భక్తులు విడిది చేసే ప్రాంతమంతటా ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశాం. ఇప్పుడు అవసరాన్ని బట్టి కొన్నింటిని ఏర్పాటు చేశాం. జాతర సందర్భంగా మిగతా వాటన్నిటినీ ఉపయోగంలోకి తీసుకువస్తాం. దీని వల్ల కరెంట్ నష్టాలు తగ్గుతాయి.

రూ.16కోట్లతో..


జాతరలో రూ.16కోట్ల అంచనా వ్యయంతో కరెంట్ పనులు చేపట్టాం. జాతరలో 160 కేవీఏ, 100 కేవీఏ తదితర ట్రాన్స్‌ఫార్మర్లు సుమారు 200 వరకు ఏర్పాటు చేశాం. జాతరలో రెండు సబ్‌స్టేషన్లు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. అంతకుముందు తాడ్వాయి నుంచి చిన్న ట్రాన్స్‌ఫార్మర్ నుంచి కరెంట్‌ను తీసుకోవలసి వచ్చేంది. 2013లో కొత్తూరులో ఒకటి, ఆ తర్వాత మ్యూజియం దగ్గర మరోసబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేశాం. ఇక్కడి నుంచి నాలుగు ఫీడర్లు వెళుతున్నాయి. వీటిలో ఒక ఫీడర్ ప్రత్యేకంగా అమ్మవారి గద్దెల వరకు వెళుతుంది. ఈ రెండు సబ్‌స్టేషన్ల నుంచి రెండు లైన్లు వేసాము. దీనితో కరెంట్ సరఫరాలో అంతరాయం కలగడం అనేది ఉండదు.

భక్తులు విడిది చేసే ప్రాంతమంతా..

గతంలోకన్నా ఇప్పుడు భక్తులరాక గణనీయంగా పెరిగింది. దీనితో జాతర విస్తీర్ణం కూడా పెరిగింది. దానిని దృష్టిలో పెట్టుకొని జాతరలో భక్తులు విడిది చేసే ప్రాంతమంతటా కరెంట్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. భక్తులు విడిది చేయడం కన్నెపల్లి నుంచి మొదలై అమ్మవారు బయలుదేరు చిలకలగుట్ట ఆ చుట్టుపక్కల ప్రాంతాల వరకు ఉంటుంది. ఈ మొత్తం ప్రాంతానికి కరెంట్ సరఫరా ఉండేలా లైన్లు వేశాం. ప్రధానంగా గద్దెల నుంచి అరకిలోమీటర్ వరకు పటిష్టమైన విద్యుత్ సరఫరా వ్యవస్థ ఎప్పటికీ అందుబాటులో ఉంటుంది.



జాతర ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్న దృశ్యం



సీజీఎం మోహన్‌రావు

ఆర్టీసీవారికి..

జాతరలో ఆర్టీసీకి సంబంధించి ఈ సారి కొన్ని అదనపు పనులను కూడా చేపట్టాం. ఆర్టీసీ గట్టమ్మవద్ద రెండు పార్కింగ్ స్థలాలను, అలాగే తాడ్వాయి వద్ద మరో హోల్డింగ్‌ను అదనంగా ఏర్పాటు చేస్తోంది. అక్కడ అవసరమైన విద్యుత్ సరఫరా ఏర్పాటు చేస్తున్నాం. గద్దెల తర్వాత భక్తుల రద్దీ ఎక్కువ ఉండేది జాతరలోని ఆర్టీసీ బస్‌స్టేషన్ల వద్దనే. దీనిని దృష్టిలో పెట్టుకొని ఆర్టీసీవారి సూచనల మేరకు విద్యుత్ సరఫరా ఏర్పాట్లు చేశాం. సరఫరాలో అంతరాయం కలుగకుండా ప్రత్యేకంగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశాం. సరఫరాలో అంతరాయం ఏర్పడినపుడు వెంటనే సరిచేయడానికి ప్రతీ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఒక ఉద్యోగి ఎప్పుడూ అందుబాటులో ఉంటారు. ఏ చిన్న సమస్య వచ్చిన సమాచారం అందగానే అవసరమైతే మరికొంత సిబ్బంది కూడా అక్కడికి వెళ్లి తక్షణం పరిష్కరించేలా ఏర్పాట్లు చేశాము.

425 మంది సిబ్బంది

నిరంతరం విద్యుత్‌ను సరఫరా చేయడమే కాకుండా మరింత మెరుగ్గా ఇచ్చేందుకు జాతరలో 425 మంది సిబ్బందిని నియమిస్తున్నాం. ఒక డైరెక్టర్ స్థాయి అధికారితో పాటు ఇద్దరు చీఫ్ ఇంజనీర్లు, ఏడుగురు డీఈలు, 15మంది అదనపు ఏడీలు, ఏఈలు, లైన్లుమన్లు ఓ అండ్‌ఎం స్టాఫ్ వీరిలో ఉన్నారు. వీరంతా జాతర జరిగే నాలుగు రోజులు రాత్రింబవళ్లు విధుల్లో ఉంటారు. వీరితోపాటు ఎక్కడైనా పోల్ విరిగినా, లైన్లలో అంతరాయం కలిగినా తన కూలీలతో ఆ పనులు పూర్తి చేయడానికి సంబంధిత కాంట్రాక్టర్‌ను కూడా అందుబాటులో ఉంచుతున్నాం.

అంతరాయం కలుగకుండా...

జాతరలో చిరువ్యాపారులు తీగలపై వైర్లు వేసి అక్రమంగా కరెంట్ వాడుకోవడం తరుచూ జరుగుతుంటుంది. దీని వల్ల ట్రాన్స్‌ఫార్మర్లపై అదనపు లోడు పడి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. దీనిని నివారించడానికి ఈ సారి ఆధునాతన సాంకేతికతను వాడుతున్నాం. దీనికోసం ఎన్‌పీడీసీఎల్ ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించింది. ఎక్కడైనా తీగలపై వైర్లు వేసినా ఆ విషయం క్షణాల్లో జాతరలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు తెలుస్తుంది. సిబ్బందిని వెంటనే అప్రమత్తం చేసి దానిని నివారిస్తాం.

ప్రమాదాల నివారణకు..

జాతరలో ఇసుకవేస్తే రాలనంత జనం ఉంటారు. ఒత్తిడి తీవ్రంగా ఉంటుంది. ఈ క్రమంలో పోల్స్ దెబ్బతినో, మరేదైనా కారణంవల్ల కరెంట్ వైర్లు తెగి భక్తులపై పడకుండా నివారించేందుకు ప్రతీ మూడు మీటర్లకు ఒక ప్లాస్టిక్ స్పేసర్‌ను వైర్లపై ఏర్పాటు చేస్తున్నాం. వైర్లు సుమారు 17 మీటర్ల ఎత్తులో ఉంటాయి. ప్రమాదవశాత్తు ఎక్కడైనా వైర్ తెగినా అది భక్తులకు తగలనంత ఎత్తులోనే వేలాడుతుంటాయి. దీనివల్ల భక్తులు విద్యుదాఘాతానికి గురయ్యే ప్రమాదం ఉండదు.

సిబ్బందికి వసతి

జాతరలో పనిచేసే విద్యుత్ అధికారులు, సిబ్బంది కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రతీ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఒకటి చొప్పున 40వరకు టెంట్లు వేస్తున్నాం. ఒక్కో టెంట్‌లో ఐదుగురికి వసతి ఉంటుంది. వీరు విధి నిర్వహణ అనంతరం ఇందులో విశ్రాంతి తీసుకోవచ్చు. అంతేకాకుండా సిబ్బందికి భోజన వసతి కోసం జాతరలోని రెండు సబ్‌స్టేషన్ల వద్ద ఫుడ్ కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నాం.

సీఎండీ ప్రత్యక్ష పర్యవేక్షణ

ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి మేడారం జాతరలో కరెంట్ పనులను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తు న్నారు. కరెంట్ సరఫరా ఏర్పాట్లు సకాలంలో పూర్తయ్యేలా మార్గదర్శనం చేస్తున్నారు. ఇప్పటికే రెండుసార్లు మేడారం సందర్శించి పనుల పురోగతిని సమీక్షించారు. ఎన్‌పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సమీక్ష సమావేశాలు నిర్వహించి పనుల ప్రగతిని అడిగి తెలుసుకుంటున్నారు. గత జాతర కన్నా ఈసారి విద్యుత్ సరఫరా ఏర్పాట్లు మరింత మెరుగ్గా ఉండేలా అన్ని చర్యలు తీసుకుంటున్నారు. ప్రభుత్వం నుంచి కొంత మేరకు నిధులు అందాయి. మిగతా వాటిని ఎన్‌పీడీసీఎల్ సంస్థ భరిస్తోంది. జాతరలో దుకాణాలకు కరెంట్ సరఫరా చేయడం వల్ల వచ్చే ఆదాయం ఏమంత ఎక్కువగా ఉండదు. అయినా కూడా భక్తుల సౌకర్యాలను దృష్టిలో ఉంచుకొని వీలైనంత మేరకు శాశ్వత ప్రాతిపదికన ఏర్పాట్లు చేస్తున్నాం.



విద్యుత్ స్తంభానికి వైరు సరిచేస్తున్న సిబ్బంది

ఎన్నికల వేళ.. 'ఉక్కు'వేడి

- మళ్లీ తెరపైకి బయ్యారం పరిశ్రమ అంశం
- చివరి బడ్జెట్‌లోనూ ఊసెత్తని కేంద్రం
- పదేళ్లుగా మీనమేషాలు లెక్కించిన బీఆర్ఎస్
- కాంగ్రెస్‌పైనే నిరుద్యోగుల ఆశలు

మహబూబాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): అపార ఖనిజ సంపదతో విరాజిల్లుతున్న మానుకోట ప్రాంతం ఎందుకు వెనుకబడింది. ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లేక యువత దేనికి విలవిల్లాడుతోంది? ఆరు దశాబ్దాల తెలంగాణ ఉద్యమం వెనుక నీళ్లు, నిధులు, నియామకాలు కీలకం ఎందుకయ్యాయి. మడిమ తిప్పని మలిదశ ఉద్యమ పోరాట ఫలితంగా కేంద్రంలోని యూపీఏ ప్రభుత్వం తెలంగాణ ఇవ్వడం.. సాధన ఉద్యమ పార్టీగా బీఆర్ఎస్ పదేళ్ల పాలించడం.. ఇవన్నీ వరుసగా జరిగిన పరిణామాలు..! తాజాగా గురువారం ప్రవేశపెట్టిన చివరి పార్లమెంట్ బడ్జెట్‌లోనూ తెలంగాణ ఉక్కు ఊసేలేకుండా పోయింది. దీనికి ముందే కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే విభజన చట్టంలోని హామీలు నెరవేర్చుకోగలమని ఇటీవలనే సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేయడంతో తెలంగాణ ఉక్కు అంశాన్ని కాంగ్రెస్ రేపటి పార్లమెంట్ ఎన్నికల్లో ప్రధానాస్త్రంగా సంధించబోతుందన్న సంకేతాలు కన్పిస్తున్నాయి. ఉక్కు పరిశ్రమ నినాదం ప్రతీ ఎన్నికల్లో ఓట్లను కొల్లగొట్టే హామీగానే మిగిలిపోతూ వస్తున్న క్రమంలో ఈ పార్లమెంట్ ఎన్నికల పోరులో బయ్యారం ఉక్కు వేడి మరింత రాజుకోబోతోంది. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ రాష్ట్ర అధికారంలో ఉన్న దరిమిలా విభజన చట్టంలోని ఉక్కు పరిశ్రమ హామీ ఇకనైనా అమలురూపం దాల్చేలా కార్యాచరణ చేపట్టే బాధ్యత తీసుకుంటుందని యువత ఆశిస్తోంది.


ఉక్కు వెనక నడిచిన తతంగమిదీ..

రాష్ట్ర పునర్విభజన చట్టంలోని తెలంగాణ ఉక్కు పరిశ్రమ ఏర్పాటు రెండుసార్లు జరిగిన పార్లమెంట్ ఎన్నికల నెరవేరని వాగ్దానాలుగానే మిగిలిపోయాయి. సుదీర్ఘకాలంగా సర్వేలపై సర్వేలతో పదేళ్ల పాటు నానుస్తూ వచ్చిన కేంద్రంలోని బీజేపీ, కేంద్రం కాదంటే సింగరేణి ద్వారానైనా పరిశ్రమ ఏర్పాటు చేస్తామన్న పూర్వ తెలంగాణ ప్రభుత్వ ప్రకటనలు ఎన్నికల హామీలుగానే మిగిలిపోయాయి. తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన ఏకైక ఉక్కుపరిశ్రమ అంశాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరుగున పడేశాయి. బయ్యారం ఇనుప ఖనిజం నిక్షేపాల వెలికితీతకు ఆరు దశాబ్దాల కిందటి చరిత్ర ఉంది. 1952లో తొలిసారిగా బయ్యారంలో మినీ ఉక్కుకర్మాగారం ఏర్పాటు చేసి కొంతకాలం పాటు ఇనుప ఖనిజాన్ని వెలికితీశారు. అలా వెలికితీసిన ఖనిజాన్ని ఇతర రాష్ట్రాలతో పాటు జపాన్‌కు ఎగుమతి చేసేవారు. తర్వాత ఏ కారణం చేతనో కానీ ఇనుప ఖనిజం వెలికితీత పనులు నిలిచిపోయ్యాయి. ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్సార్ ప్రభుత్వ హాయంలో 2004 నుంచి 2009వరకు 5ఏళ్ల పాటు ఖనిజాన్ని మళ్లీ వెలికిసి, ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో బయ్యారం ఉక్కు అంశం కీలకంగా మారడంతో అప్పటి యూపీఏ ప్రభుత్వం రాష్ట్రం విభజన చట్టంలో ఖమ్మం జిల్లాలో స్టీల్ పరిశ్రమ ఏర్పాటు అంశాన్ని జోడించింది. ఆ దిశగా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు పలుమార్లు సర్వేలు జరిపారు. పలు సంస్థలు చేపట్టిన సర్వేల్లో కూడా స్టీల్ ప్లాంట్ ఏర్పాటు దిశగానే సానుకూలత రిపోర్టు వచ్చినట్లు ప్రకటనలు ఊరించాయి.

బీఆర్ఎస్ అలాగో.. ఇలాగో.. చేస్తానని..

స్వరాష్ట్ర ఆవిర్భావం నుంచి ఉక్కుఫ్యాక్టరీపై నానుస్తూ వచ్చినా కేంద్రం కుదరదని సుప్రీంకోర్టులో తేల్చిచెప్పడంతో గత సర్కార్ సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఇతర ప్రజాప్రతినిధులు కేంద్రం ఒప్పుకున్నా లేకున్నా ఎట్టి పరిస్థితుల్లో స్టీల్ ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టి తీరుతామంటూ ప్రకటనలు చేశారు. సింగరేణి సంస్థతో పాటు టీఎస్‌ఎండీసీతో ఖనిజ నాణ్యత, పరిమాణంపై సర్వేలు కూడా చేయించారు. ఇక్కడ సరిపడ ఖనిజం లేకపోయినా పక్క రాష్ట్రం ఛత్తీస్‌గఢ్ బైలడిల్లా నుంచైనా సరే ముడి సరుకును దిగుమతి చేసుకొని బయ్యారంలో స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసి తీరుతామని హామీలు గుప్పించారు. ఒకానొక సందర్భంలో హైదరాబాద్ వచ్చిన కేంద్రమంత్రి బీరేందర్ సింగ్ కూడా తెలంగాణ వాదులకు తీపి కబురంటూ ఖమ్మం జిల్లా స్టీల్ ఫ్యాక్టరీపై ప్రకటనలు చేశారు. అంతా ఉత్తుత్తే అయిపోయింది. సుమారు 300 మిలియన్ మెట్రిక్ టన్నుల అపార ఇనుప ఖనిజ నిక్షేపాలు బయ్యారంలో ఉన్నాయన్న జియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా నివేదికలు ఒకవైపు ఉన్నప్పటికీ కేంద్రం నాణ్యమైన ఐరన్‌ఓర్ బయ్యారంలో లేదని చెప్పడంతో ఉక్కు సంకల్పం ఉట్టికెక్కింది.





రాజుకుంటున్న ఉక్కు నినాదం..

స్వరాష్ట్రంలో మూడోసారి పార్లమెంట్ ఎన్నికల వేడిలో 'ఉక్కు పరిశ్రమ' హామీ రాజుకుంటోంది. కేంద్రంలోని బీజేపీ రెండుదఫాలు బయ్యారం ఉక్కుపై ఎటు తేల్చకుండానే పక్కన పెట్టేసింది. రాష్ట్రంలో సైతం ఉద్యమ ఆకాంక్షతో అధికారం చేపట్టిన బీఆర్ఎస్ కూడా దాటవేత ధోరణిలో అంకితభావాన్ని విస్మరించింది. నాడు తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలోకి రావడం ఇందులో తెలంగాణ ఉద్యమ నేత ప్రొఫెసర్ కోదండరాం కూడా భాగస్వామ్యం వహించడం దాదాపు ఖరారైన క్రమంలో నిరుద్యోగ యువతలో ఉక్కు పరిశ్రమపై ఆశలు చిగురిస్తున్నాయి.

తాజాగా ఖైరతాబాద్ ప్రాంతంలో తెలంగాణ జన సమితి ఆధ్వర్యంలో 'విభజన హామీలు, కేంద్ర ప్రభుత్వం వివక్ష' అనే అంశంపై రాష్ట్ర సదస్సు నిర్వహించడం, అందులో ఖాజీపేట కోచ్ ఫ్యాక్టరీతో పాటు బయ్యారం ఉక్కు పరిశ్రమ అంశాలు చేర్చడం రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకుంది. స్వయంగా ప్రొఫెసర్ కోదండరామ్ ఈ అంశాలపై ప్రసంగాలు చేస్తూ పాలకుల వైఫల్యాలను ఎండగడుతూ.. విభజన చట్టం హామీల అమలు ఆవశ్యకతను గుర్తు చేయడంతో కాంగ్రెస్ హయంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు దిశగా అడుగులు పడతాయన్న భావన తెలంగాణ సమాజంలో వస్తోంది. ప్రభుత్వం చేపట్టిన వందరోజుల్లో ఆరు గ్యారెంటీల అమలు కోసం కసరత్తుల్లో నిమగ్నమైన కాంగ్రెస్ ఆపై ఉక్కుపరిశ్రమ తుట్టెను కదిలిస్తుందని ఆశిస్తున్నారు. పార్లమెంట్ చివరి బడ్జెట్ సమావేశాల్లోనూ బీజేపీ ఉక్కుఊసే ఎత్తకపోవడంతో ఇక ప్రధాన ప్రతిపక్షంగా కాంగ్రెస్‌తో పాటు బీఆర్ఎస్‌కు ఇది రేపటి ఎన్నికల నినాద అయుధంగా మారుతుందనడంలో అతిశయోక్తి లేదు.

రేపు రిటైర్డ్ సీబీఐ డైరెక్టర్ ప్రసంగ కార్యక్రమం

హనుమకొండ, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): హనుమకొండ లష్కర్ బజార్‌లోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ ప్రైమరీస్కూల్‌లో ఆదివారం ఉదయం 10 గంటలకు 'భారత రాజ్యాంగం - సాంస్కృతిక వికాసం - పరిపాలన ధోరణులు' అనే అంశంపై రిటైర్డ్ సీబీఐ డైరెక్టర్ మన్నెం నాగేశ్వర రావు ప్రసంగం ఉంది. శ్రీ శారదాకృష్ణ సాహితీ సామాజిక సాంస్కృతిక ట్రస్ట్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమానికి ట్రస్ట్ చైర్మన్ కాసర్ల రంగారావు అధ్యక్షత వహిస్తారు. డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీఎన్ చారి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పాలకుర్తి దినకర్, కవి, రచయిత డాక్టర్ పల్లేరు వీరస్వామి, అరవింద ఆశ్రమం కార్యదర్శి పరిగొండ కాంతారావు ముఖ్య అతిథులుగా, కవి పండితులు గిరిజా మనోహర్ బాబు విశిష్ట అతిథిగా పాల్గొంటారు.

జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు రేపు

హనుమకొండ స్పోర్ట్స్, ఫిబ్రవరి2: వరంగల్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హనుమకొండ జవహర్‌లాల్‌నెహ్రూ స్టేడియం (జేఎన్‌ఎస్)లో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి బాల్ బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి వీరన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి జూనియర్స్ బాల బాలికల విభాగంలో ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇక్కడ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు ఈ నెల 9నుంచి 11వరకు హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన బాల బాలికలు ఈ నెల 4న హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలోని బ్యాడ్మింటన్ కోర్టులో ఉదయం 9గంటలకు రిపోర్టు చేయాలని వీరన్న సూచించారు. మరిన్ని వివరాలకు సెల్ 9849201467 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 2: హనుమకొండ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలలో పట్టుబడిన ఇద్దరికి జైలు శిక్ష విధిస్తూ జిల్లా న్యాయమూర్తి రమేష్ శుక్రవారం తీర్పు వెల్లడించారు. హనుమకొండ ట్రాఫిక్ సీఐ జి.సీతారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ ట్రాఫిక్ పోలీసుస్టేషన్ పరిధిలోని కేయూ జంక్షన్, గొల్లపల్లి, పెద్దమ్మగడ్డ, గోపాలపురం జంక్షన్‌లలో గురువారం రాత్రి డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో 18 మందిని అదుపులోకి తీసుకుని పరీక్షలు నిరహించగా, మద్యం సేవించినట్లు తెలిసింది. వీరిని శుక్రవారంకోర్టుకు తరలించగా ధర్మసాగర్ మండలం నారాయణగిరి గ్రామానికి చెందిన ఎమ్డి నజీర్, రేగొండ మండలం రాయపల్లికి చెందిన లెదెల్ల శ్రావన్‌కుమార్‌లకు రెండు రోజుల జైలు శిక్ష విధించారు. మిగతా 16 మందికి జరిమానా విధించారు.

వ్యక్తి మృతికి కారణమైన ముగ్గురికి ఐదేళ్ల జైలు, జరిమానా

- మరో ఇద్దరికి రూ.4వేల జరిమానా
- తీర్పు వెలువరించిన ప్రధాన అసిస్టెంట్ జడ్జి

వరంగల్ లీగల్, ఫిబ్రవరి 2: వైవాహిక జీవితంలో జరిగిన గొడవల నేపథ్యంలో అత్తింటి వారు వేధించడం వలన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతడి మృతికి కారకులైన భార్య కృష్ణవేణి, బావమరిది సురేష్, అత్త కనకతారలకు ఒక్కొక్కరికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ ప్రధాన అసిస్టెంట్ జడ్జి బ్బంగి శ్రీనివాసులు తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించకుంటే మరో ఆరునెలలు జైలు శిక్ష అనుభవించాల్సిందిగా తీర్పులో పేర్కొన్నారు. అదే విధంగా దాడికి పాల్పడిన మరో ఇద్దరు నిందితులు నాగరాజు, భార్య మేనమామ రాజశేఖర్ ఒక్కొక్కరికి రూ.4వేల చొప్పున జరిమానా విధించారు. జరిమానా చెల్లించకుంటే నాలుగు నెలలు జైలు శిక్ష అనుభవించాల్సిందిగా న్యాయ మూర్తి తీర్పులో పేర్కొన్నారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి.

దర్గాకు చెందిన బాసబత్తిని సురేష్‌కు వరంగల్ కాశిబుగ్గ నివాసురాలైన గోరంట్ల కృష్ణవేణితో 2016 ఏప్రిల్ 20న వివాహం జరిగింది. పెళ్లైన తర్వాత వీరిమధ్య గొడవలు మొదలై ఆరునెళ్ల తర్వాత పుట్టింటికి వెళ్లిపోయింది. ప్రతీసారి పంచాయితీ నిర్వహించి సురేష్‌తో క్షమాపణ చెప్పించేవారు. తరచూ ఇంట్లో నుంచి గొడవపడి వెళ్లిపోయేది. పెళ్లైన తొమ్మిది నెలల తర్వాత నిందితులు బావమరిది గోరంట్ల సురేష్, అత్త కనకతార, చాలాసార్లు సురేష్‌పై కుటుంబసభ్యులతో కలిసి దాడి చేశారు. ఈ క్రమంలో 2019 జనవరి 25న ఉదయం 7గంటలకు దర్గాలో ఒంటరిగా ఉంటున్న సురేష్‌పై బావమరిది సురేష్, మిత్రులు, అతడి కుటుంబసభ్యులు ఒక కారు, ఆటోలో ఇంటికి వెళ్లి విపరీతంగా కొట్టారు. ముక్కు, చెవుల నుంచి రక్తం వచ్చేలా తీవ్రంగా గాయపరిచారు. మళ్లీ ఆటోలో ఎక్కించుకొని కాశిబుగ్గ వరంగల్‌కు కొట్టుకుంటూ తీసుకెళ్లి వదిలేశారు. దీంతో సురేష్ అవమానాన్ని భరించలేక ఎవరికీ చెప్పులేక కుమిలిపోయాడు. అనంతరం అత్తింటివారు 2019 ఫిబ్రవరి 1న సురేష్, అతడి తల్లిపై మహిళా పోలీసుస్టేషన్‌లో వరకట్నం కేసు నమోదు చేయించారు.

ఈవిషయాలపై బాసబత్తిని సురేష్ మానసిక క్షోభకు గురై మనోవేదనతో 2019 ఫిబ్రవరి 5న సూసైడ్‌నోట్ రాసి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సూసైడ్‌నోట్‌లో తన చావుకు భార్య, ఆమె తరపు బంధువులు కారణమని పేర్కొన్నారు. కాగా, సురేష్ భార్య గోరంట్ల కృష్ణవేణి, బావమరిది గోరంట్ల సురేష్, అత్త కనకతార, సురేష్ మేనమామ కోట రాజ్‌కుమార్, అతడి స్నేహితుడు వేముల నాగరాజుపై చట్టరీత్యా చర్య తీసుకోవాలని మృతుడి అక్క బాసబత్తిని సంధ్యారాణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి పోలీసులు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు విచారణలో నేరం రుజువైనందున ఐదుగురి నిందితులకు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. కోర్టు పీసీ ఎ. సుధాకర్ సాక్షులను ప్రవేశపెట్టగా, దర్యాప్తు అధికారులుగా ఎస్సైలు డి. దేవేందర్, సర్దార్ రాజు వ్యవహరించారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎ. భద్రాద్రి కేసు వాదించారు.

విద్యార్థులకు గుణాత్మక విద్య అందించాలి

తాడ్వాయి, ఫిబ్రవరి 2 : ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించాలని జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి బద్దం సుదర్శన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఇందిరానగర్ జడ్పీహెచ్ఎస్‌లో శుక్రవారం జరిగిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతంలోని విద్యార్థుల స్థాయికి తగిన విద్యను అందించాలని, విద్యా బోధనలో అనుసరించాల్సిన పద్ధతులను సూచించారు. స్థానిక పరిసరాలకు అనుగుణంగా సులువైన పద్ధతిలో బోధన చేపట్టాలన్నారు. విద్యాశాఖ అధికారుల ఆదేశానుసారం పాఠ్య ప్రణాళికను రూపొందించుకుని సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ప్రాథమిక స్థాయిలో విద్యార్థులు చదవడం, రాయడంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పాటు అందిస్తూ మార్గదర్శకంగా ఉండాలని కోరారు. సమావేశంలో మండల నోడల్ ఆఫీసర్ ఆర్.కేశవరావు, రిసోర్స్‌పర్సన్లు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

మోదీ పాలనకు చరమగీతం పాడాలి

కాటారం, ఫిబ్రవరి 2: మతం పేరిట ప్రజలను విభజిస్తూ వారి మధ్య చిచ్చు పెడుతూ మోసం చేస్తున్న మోదీ నేతృత్వంలోని బీజేపీ పాలనకు చరమగీతం పాడాలని ప్రజా సంఘాల రాష్ట్ర నేతలు అక్కల బాపు, వీక కిరణ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శుక్రవారం వారు మాట్లాడుతూ దేశ సంపదను కార్పొరేట్ వ్యవస్థకు అప్పగిస్తున్నారని ఆరోపించారు. విద్యా రంగానికి అధిక బడ్జెట్ కేటాయించని ప్రభుత్వం విగ్రహాలకు, గుళ్లకు వందల కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నదని మండిపడ్డారు. పేద ప్రజలు, కార్మికులు, కర్షకులు నానా తిప్పలు పడుతున్నారని, మహిళలు రక్షణ లేక ఇబ్బందులు పడుతుంటే మత విద్వేషాలు రేపుతూ 10 ఏళ్ల ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబించిన మోదీ పాలనకు ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. సమావేశంలో సంఘాల నాయకులు శంకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పూజారుల సంఘం అధ్యక్షుడిపై ఫిర్యాదు

మేడారం, ఫిబ్రవరి 2 : తనకు రావల్సిన వాటా ధనంతో పాటు, పూజారులకు దక్కాల్సిన లబ్ధిని పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు దక్కకుండా చేస్తున్నారని మేడారం సారలమ్మ పూజారి కాక అమృతమ్మ ఆరోపించారు. శుక్రవారం గద్దెల ప్రాంగణంలో విలేకరులతో మాట్లాడారు. జాతర సమయంలో తనకు రావల్సిన వాటాతో పాటు పూజారులకు దేవాదాయ శాఖ నుంచి వచ్చే నిత్యావసర సరుకులు అందకుండా చేస్తున్నారని అన్నారు. తాను సారలమ్మ ప్రధాన పూజారిని అయినా తన పేరు జాతర పూజారుల సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన క్యాలెండర్‌లో లేదని తెలిపారు. మిగతా పూజారుల కుటుంబీకులు చనిపోతే వారసత్వం ఇచ్చారని, తనకు మాత్రం వర్తించదని అంటున్నారని చెప్పారు. పూజారుల సంఘం అధ్యక్షుడు ఉద్దేశపూర్వకంగానే తనను ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఆమె ఆరోపించారు. తనకు న్యాయం చేయాలని కోరుతూ కార్యనిర్వహణ అధికారి రాజేంద్రం, వస్రా సీఐ శంకర్‌కు ఫిర్యాదు చేసినట్లు అమృతమ్మ పేర్కొన్నారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు నైన్‌పాక విద్యార్థినులు

చిట్యాల, ఫిబ్రవరి 2 : భూపాలపల్లి జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని మడతపల్లిలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో నైన్‌పాక విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. నైన్‌పాక పాఠశాల విద్యార్థినులు పోతుగంటి అక్షిత, కొండ స్వేచ్ఛలు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు ఊర్మిళ తెలిపారు. ఈ నెల 3, 4 తేదీల్లో మెదక్ జిల్లా తూప్రాన్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొననున్నట్లు చెప్పారు. కాగా, రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థినులను ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు అభినందించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ గొర్రె సాగర్, ఎంపీటీసీ కట్టికోళ్ల రమేష్, పీఈటీ లింగయ్య పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలి

» ఆవిర్భావ వేడుకల్లో ఏపీవో చరణ్ రాజు



ఆకులవారిఘణపురంలో ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న కూలీలు

ఏటూరునాగారం, ఫిబ్రవరి 2 : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 19వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. శుక్రవారం మండల కేంద్రంలోని ఆకులవారిఘణపురం సమీపంలో గల ఎర్రకుంట చెరువు వద్ద ఉపాధి హామీ పనులు జరుగుతున్నాయి. ముఖ్య అతిథిగా ఏపీవో చరణ్‌రాజు హాజరై మాట్లాడుతూ.. నిరుపేద, పేద ప్రజలు ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా ప్రభుత్వం ఏర్పాటు చేసిన 100 రోజుల పనులను 2005 ఫిబ్రవరి 2న బండ్లకుంట అనే గ్రామంలో పేద ప్రజల ఉపాధి కల్పన కోసం ప్రారంభమైందన్నారు. ముఖ్యంగా పేద ప్రజల కోసం అప్పటి దేశ ప్రధాని మన్మోహన్‌సింగ్ పార్లమెంటులో ప్రవేశపెట్టి ఈ చట్టాన్ని తీసుకురావడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఏ సాంబశివరావుతో 80 మంది కూలీలు పాల్గొన్నారు.

● కాటారం : కాటారంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంతో పాటు పలు జీపీల పరిధిలోని పని ప్రదేశాల్లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో శంకర్ నాయక్, ఎంపీవో ఉపేంద్రయ్య, పంచాయతీల కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఈజీఎస్ కూలీలతో కలిసి పలు చోట్ల కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరిపారు. కోట్లాది మంది పేదలకు ఉపాధి అందిస్తున్న పథకమని కూలీలు కొనియాడారు. కార్యక్రమంలో జీపీ కార్యదర్శులు సఫీర్‌ఖాన్, ఉమాదేవి, మల్లి కార్జున్‌రెడ్డి, వేణుగోపాల్, కరుణాకర్, కృష్ణవేణి, శ్రీనివాస్, రాజశేఖర్, రజిత, జ్యోత్స్న, అపర్ణ పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రత్యేక పాలన షురూ..

» బాధ్యతలు స్వీకరించిన అధికారులు



గంగారంలో బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవో శంకర్‌నాయక్

కాటారం, ఫిబ్రవరి 2 : మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో శుక్రవారం సర్పంచుల స్థానంలో ప్రత్యేకాధికారులుగా నియమితులైన అధికారులు బాధ్యతలు స్వీకరించారు. 14 మంది వివిధ శాఖల అధికారులను 24 జీపీలకు కేటాయించారు. కాటారం జీపీలో డీహెచ్‌వో సంజీవరావు, రేగులగూడెం, శంకరంపల్లిలో తహసీల్దార్ నాగరాజు, ధన్వాడ, గంగారంలో ఎంపీడీవో శంకర్‌నాయక్, చిద్నెపల్లి, ప్రతాపగిరిలో ఎంపీవో ఉపేంద్రయ్య, చింతకాని, ఇబ్రహీంపల్లిలో డీటీ రామ్మోహన్, ఆదివారంపేట, గుమ్మళ్లపల్లిలో వెటర్నరీ డాక్టర్ అభిషేక్, అంకుసాపూర్, బయ్యారంలో డీసీవో శైలజ, దామెరకుంట, గుండ్రాత్‌పల్లిలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజశేఖర్, నస్తూరుపల్లి, మద్దులపల్లిలో మిషన్ భగీరథ ఏఈఈ కళ్యాణ్, జాదరావుపేట, వీరాపూర్‌లో ఏవో రామకృష్ణ, ఒడిపిలవంచ, ధర్మసాగర్‌లో వెటర్నరీ డాక్టర్ రాకేష్‌శర్మ, కొత్తపల్లిలో పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ గోవర్ధన్, మేడిపల్లిలో ఆశ్రమ పాఠశాల హెచ్ఎం రవిశంకర్, విలాసాగర్‌లో హెచ్ఎం రవీందర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఆయా జీపీల్లో పారిశుధ్య నిర్వహణ పనులు, రేషన్ షాపులను అధికారులు పరిశీలించారు.

● మహదేవపూర్: మండలంలోని 18 గ్రామపంచాయతీలకు ప్రత్యేకాధికారులను నియమించగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మండలకేంద్రమైన మహదేవపూర్‌కు డీఎల్‌పీవో సుధీర్‌కుమార్, కాళేశ్వరం, మెట్‌పల్లి గ్రామాలకు తహసీల్దార్ లక్ష్మిరాజయ్య, ఎలికేశ్వరంకు ఎంపీడీవో రవీంద్రనాథ్, బ్రాహ్మణపల్లి, బొమ్మాపూర్‌కు నాయబ్ తహసీల్దార్ కృష్ణ, బెగ్లూరు, సూరారం గ్రామాలకు ఎంపీవో ప్రసాద్, అంబట్‌పల్లి, పెద్దంపేటలకు అసిస్టెంట్ సెరికల్చర్ ఆఫీసర్ సమ్మయ్య, అన్నారం చంద్రుపల్లికి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వినయ్, కుదురుపల్లి, ఎడపల్లికి పంచాయతీరాజ్ ఏఈ రవీందర్, పలుగుల మద్దులపల్లి గ్రామాలకు వెటర్నరీవైద్యాధికారి మల్లేష్, రాపల్లికోట, ఏన్కపల్లి గ్రామాలకు ఇరిగేషన్ ఏఈ శిరీష్‌ను నియమించారు.

● ఏటూరునాగారం : ఏటూరునాగారం మండల మేజర్ గ్రామపంచాయతీకి ప్రత్యేక అధికారిగా నియమితులైన ఐటీడీఏ ఏవో టీవీ.దామోదరస్వామి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనను పలువురు నేతలు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామస్థులకు నిత్యం అందుబాటులో ఉంటానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఆయను కలిసి వారిలో ములుగు జిల్లా జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బట్ట మురళీకృష్ణ, ఉపాధ్యక్షుడు మంచర్ల నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు, జిల్లా ఉపాధ్యక్షుడు ఎమ్డీ.ఖలీల్ ఖాన్, జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఎమ్డీ.అయుబ్ ఖాన్, పార్టీ అధికార ప్రతినిధి ముక్కెర లాలయ్య మండల ప్రధాన కార్యదర్శి వావిలాల ఎల్లయ్య, టౌన్ అధ్యక్షుడు ఎమ్డీ.సులేమన్ పాల్గొన్నారు.

● మల్హర్ : గ్రామ పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ముగియడంతో ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది. మండల కేంద్రమైన తాడిచర్ల జీపీకి ప్రత్యేకాధికారిగా మండల ప్రత్యేకాధికారి అవినాష్, అన్‌సాన్‌పల్లి, నాచారంకు ప్రత్యేకాధికారిగా హరిత, చిన్నతూండ్ల, మల్లారం జీపీలకు సుధాకర్, దుబ్బపేట, వల్లెంకుంట జీపీలకు విక్రమ్, ఎడ్లపల్లి, కొయ్యూర్ జీపీలకు అశోక్‌కుమార్, కొండంపేట, ఇప్పలపల్లి జీపీలకు శ్రీనివాస్, అడ్వాలపల్లి, పెద్దతూండ్ల జీపీలకు నర్సింహమూర్తి, రుద్రారం, మల్లంపల్లి జీపీలకు శ్రీనివాస్‌లు నియమితులయ్యారు. కొయ్యూర్ జీపీ స్పెషల్ ఆఫీసర్‌గా నియమించబడిన పీఆర్ ఏఈ అశోక్‌ను మాజీ సర్పంచ్ లింగమూర్తి గ్రామపంచాయతీ కార్యాలయంలో సన్మానించారు.

నేడు ద్విచక్ర వాహనాల వేలం

ఏటూరునాగారం, ఫిబ్రవరి 2 : ఏటూరునాగారం ఎక్సైజ్ పోలీసులు గుడుంబా, మద్యం అక్రమంగా తరలింపు తదితర కేసుల్లో స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలకు శనివారం మండల కేంద్రంలోని స్థానిక ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో వేలం వేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ ఫకీరా ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ప్రభుత్వం నిర్ణయించిన ధరలో 50 శాతం ఈఎండీ చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని కోరారు. మధ్యాహ్నం ఒంటిగంట నుంచి ఈ వేలం జరుగుతుందని సీఐ పేర్కొన్నారు.

గ్రామాల్లో సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

వెంకటాపూర్(రామప్ప), ఫిబ్రవరి 2: గ్రామాల్లోని ప్రజలు అసాంఘిక శక్తులకు ఆశ్రయం కల్పించవద్దని, నేరాల నియంత్రణకు ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై చల్ల రాజు అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లోకి ఎవరైనా అపరిచిత వ్యక్తులు వచ్చినట్లయితే పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు. ప్రశాంత వాతావరణంలో జీవనం గడపాలని ప్రజలకు సూచించారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల నేరాల అదుపునకు సహకరించిన వారవుతారని పేర్కొన్నారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి



మండల కేంద్రంలో ఉపాధ్యాయులకు ఫారం-18 అందిస్తున్న కిరణ్‌కుమార్

చిట్యాల, ఫిబ్రవరి 2: పట్టభద్రులంతా ఎమ్మెల్సీ ఎన్నికల కోసం తమ ఓటును నమోదు చేసుకోవాలని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కుసునపు కిరణ్‌కుమార్ అన్నారు. నియోజవర్గంలో కొనసాగుతున్న ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో భాగంగా శుక్రవారం పీఆర్‌టీయూ మండలశాఖ ఆధ్వర్యంలో చిట్యాల మండల కేంద్రంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్ హాజరై మాట్లాడుతూ అర్హులైన ప్రతీ ఒక్కరు ఎమ్మెల్సీ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయులకు ఫారం-18 దరఖాస్తులను అందజేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు భగవాన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బండి శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాంబారు హన్మంతు, మండల ఉపాధ్యక్షురాలు శైలజ తదితరులు పాల్గొన్నారు.

గోదావరిలో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

వెంకటాపురం(నూగూరు), ఫిబ్రవరి 2 : మండలంలో గోదావరి నదిలో గల్లంతైన వ్యక్తి మృతదేహం శుక్రవారం లభ్యమైంది. గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం మేడు గ్రామానికి చెందిన పుప్పాల రాజు(40) మండలంలోని సూరవీడు గ్రామంలో బంధువుల ఇంట్లో జరిగిన శుభకార్యానికి గురువారం వచ్చాడు. ఈ క్రమంలో గోదావరి నదిలో స్నానం చేసేందుకు వెళ్లి గల్లంతయ్యాడు. కాగా, గల్లంతైన రాజు కోసం బంధువులు, గ్రామస్థులు పడవల్లో గాలింపు చర్యలు చేపట్టారు. శుక్రవారం ఉదయం గోదావరిలో గాలిస్తుండగా రాజు మృతదేహం లభ్యం కాగా, స్థానిక వైద్యశాలకు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

కేంద్ర బడ్జెట్‌లో దళిత సమగ్రాభివృద్ధిపై చిత్తశుద్ధి కరువు

» కేవీపీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు

కాటారం, ఫిబ్రవరి 2: బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ కేంద్ర బడ్జెట్‌లో దళిత సమగ్రాభివృద్ధిపై చిత్తశుద్ధి కరువైందని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఇనునం మహేందర్, గుర్రం దేవేందర్ విమర్శించారు. శుక్రవారం మండల కేంద్రంలో కేవీపీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరుగగా వారు మాట్లాడుతూ బడ్జెట్‌లో అంకెల్లో పెరుగుదల.. ఖర్చులో తరుగుల ఉందని ఆరోపించారు. గతేడాది బడ్జెట్‌లో కేటాయించిన నిధుల్లో 40 శాతం ఖర్చు చేయకుండానే మురగబెట్టారని దుయ్యబట్టారు. సబ్‌ప్లాన్ కింద కేటాయించిన నిధులను దళితుల ప్రత్యక్ష ప్రయోజనాల కోసం ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం నేతలు చందు, స్వామి, రాజయ్య, గట్టయ్య రవీందర్, పొట్టయ్య సంతోష్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగస్తులను నిరాశపర్చిన బడ్జెట్ : పీఆర్‌టీయూ

టేకుమట్ల : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రభుత్వ ఉద్యోగులకు ఒక్క వెసులుబాటు కూడా లేకుండా నిరాశపరిచిందని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు బుచ్చి రాములు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆదాయ పరిమితి రూ.9 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాలని, పన్నుల భారం తగ్గించాలని కోరారు. మూడు సంవత్సరాల నుంచి ఆదాయ పరిమితి పెంచాలని ఉద్యోగ సంఘాలు కోరినప్పటికీ పట్టించుకోకపోవడం శోచనీయన్నారు. కార్పొరేట్లకు పన్ను భారం తగ్గించి ఉద్యోగుల గురించి మాత్రం పట్టించుకోక పోవడం బాధాకరమని ఆయన పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి

కన్నాయిగూడెం, ఫిబ్రవరి 2 కారు ఢీకొని తీవ్రంగా గాయపడిన చిన్నారి శిరీష హనుమకొండలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందింది. ఎస్సై సురేష్ తెలిపిన ప్రకారం... మండలంలోని ఏటూరు గ్రామానికి చెందిన శ్రావణి, విజయ్ దంపతుల ఏడేళ్ల కూతురు శిరీషను బుట్టాయిగూడెంకు చెందిన తాడూరి శ్రీధర్ గత నెల 30న కారుతో ఢీకొన్నాడు. తీవ్ర గాయాలైన బాలికను హనుమకొండలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందినట్లు తెలిపారు. తండ్రి విజయ్ శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

శ్రీపాదరావు స్మారక జీపీఎల్ క్రికెట్ టోర్నీ ప్రారంభం



టోర్నీని ప్రారంభించి మాట్లాడుతున్న శ్రీనుబాబు

కాటారం, ఫిబ్రవరి 2: మండల కేంద్రంలో మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు స్మారక డివిజన్ స్థాయి గారెపల్లి ప్రీమియర్ లీగ్(జీపీఎల్) క్రికెట్ టోర్నీ శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సోదరుడు, శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ దుద్దిళ్ల శ్రీనుబాబు ముఖ్య అతిథిగా హాజరై టోర్నీని ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని బ్యాటింగ్ చేసిన అనంతరం క్రీడాకారులనుద్దేశించి మాట్లాడారు. యువత చెడు మార్గంలో పయనించకుండా క్రీడల వైపు దృష్టి సారించాలని అన్నారు. క్రీడలతో శారీరక దారుఢ్యం, మానసిక ప్రశాంతత లభిస్తాయన్నారు. రాబోయే ఏప్రిల్ నెలలో తెలంగాణ స్థాయి క్రికెట్ టోర్నీని భారీ ప్రైజ్‌మనీతో నిర్వహించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ప్రాంతంలో క్రీడాకారులకు అవసరమైన వసతి సౌకర్యాల కోసం మంత్రి శ్రీధర్‌బాబు కృషి చేస్తారన్నారు. కార్యక్రమంలో సీఐ రంజిత్‌రావు, ఎంపీపీ పంతకాని సమ్మయ్య, ఎంపీటీసీలు రవీందర్‌రావు, మహేశ్వరి, విజయరెడ్డి, అబ్దుల్ అజీజ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, యూత్ రాష్ట్ర అధికార ప్రతినిధి విలాస్‌రావు, మండల అధ్యక్షుడు చీమల సందీప్, కాంగ్రెస్ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు సుగుణ, మల్లయ్య, గద్దె సమ్మిరెడ్డి, వంశవర్ధన్‌రావు, నాయిని శ్రీనివాస్, రమేష్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, కొట్టె శ్రీహరి, అశోక్, నరేష్, ప్రభాకర్, వెంకటరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, సునీల్‌రావు, మొగిలి, దేవేందర్, ఉమాశంకర్, కిరణ్, సాయి పాల్గొన్నారు.

అన్నదాతల హైరానా..!



కాటారం మండలంలో సీసీఐ కేంద్రం వద్ద నిల్వ ఉన్న పత్తి (ఫైల్)

(5వ పేజీ తరువాయి)

రైతాంగానికి చేతికి వచ్చిన పంటను అమ్ముకునేందుకు అవస్థలు తప్పడం లేదు.

సీసీఐ కేంద్రాల్లో నిలిచిన కొనుగోళ్లు

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పత్తి విక్రయాలు జోరందుకున్నాయి. ప్రైవేటు వ్యాపారులు మద్దతు ధరకు కొనుగోలు చేయరనే ఉద్దేశ్యంతో చాలా మంది రైతులు సీసీఐ కేంద్రాల్లోనే విక్రయించేందుకు మొగ్గు చూపుతున్నారు. కొనుగోళ్ల ఆరంభంలో దళారులు సీసీఐకి సమానంగా ధర చెల్లించినా.. ప్రస్తుతం మద్దతు ధర కంటే తక్కువకే కొనుగోళ్లు చేస్తామంటూ చెబుతున్నారు. దీంతో రైతులు సీసీఐ కేంద్రాలకు బారులు తీరడంతో పత్తి నిల్వలు పేరుకపోయాయి ఈ నేపథ్యంలో జిల్లాలో ఉన్న మూడు సీసీఐ కేంద్రాల్లో కొనుగోళ్లకు తాత్కాలిక విరామం ఇచ్చినట్లు మార్కెటింగ్ శాఖ అధికారులు వెల్లడించారు. మళ్లీ ఈ నెల 8 లేదా 10వ తేదీ నుంచి కొనుగోళ్లు పునఃప్రారంభిస్తామని చెబుతున్నారు. అయితే ఇప్పటికే చేరుకున్న పత్తి కొనుగోళ్లలో ఎక్కడాలేని విధంగా నిబంధనల పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు తెలిసింది. నిబంధనలకు విరుద్ధంగా చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు రైతులు దిగాలు చెందుతున్నారు.

1,12,463 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు

జిల్లాలో ప్రభుత్వం తరుపున భూపాలపల్లి, చిట్యాల, కాటారంలో ఒకటి చొప్పున సీసీఐ కేంద్రాలున్నాయి. వీటి ద్వారా ఇప్పటి వరకు 1,12,463 క్వింటాళ్ల పత్తిని మాత్రమే కొనుగోలు చేశారు. కాటారంలో 23,969, భూపాలపల్లి సీసీఐ ద్వారా 15,607, చిట్యాలలోని సీసీఐ నుంచి 62,887 క్వింటాళ్ల పత్తిని కొనుగోళ్లు చేసినట్లు మార్కెటింగ్ శాఖ అధికారులు తెలిపారు. ఆయా కేంద్రాల నుంచి 7 లక్షల క్వింటాళ్ల పైచిలుకు పత్తిని కొనుగోలు చేయాల్సి ఉండగా.. లక్ష్యానికి ఆశించనంత దూరంలో కొనుగోళ్లు సాగుతున్నాయి.

గ్రామాల్లో దళారుల దందా..

ఆరుగాలం కష్టపడి పండించిన పత్తి రైతుల కష్టం దళారుల పాలవుతోంది. గ్రామాల్లో రైతుల నుంచి కొనుగోలు చేసి వాహనాల్లో తరలించి విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. తూకంలో మోసం చేస్తూ పత్తి కొనుగోళ్లు చేసే దళారుల దందా ఇటీవల జిల్లాలో బయటపడింది. జిల్లాలోని రేగొండ మండలం వెంకటేశ్వర్లపల్లి గ్రామంలో జనవరి 28వ తేదీన జగిత్యాల జిల్లా కోరుట్లకు చెందిన ఇరువురు దళారులు పత్తి కొనుగోళ్లు చేస్తామంటూ ప్రత్యేక వాహనంలో తిరిగారు. ఈ క్రమంలో తూకంలో వ్యత్యాసం ఉండటాన్ని గమనించి నాగ్వాదానికి దిగారు. ఆ వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో రైతుల ఫిర్యాదు మేరకు దళారులపై కేసు నమోదు చేశారు. ఇక జనవరి 31న కాటారం మండలంలోని రుద్ర జిన్నింగ్ మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ కేంద్రంలో పత్తి కొనగోళ్లు సరిగ్గా చేయడం లేదంటూ ప్రధాన రహదారిపై బైఠాయించి రైతులు ఆందోళన చేశారు. అయినప్పటికి సంబంధిత అధికారులు పట్టనట్లుగా వ్యవహరిస్తుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది.

ఆశించిన స్థాయిలో రాని దిగుబడి

జిల్లా వ్యాప్తంగా 11 మండలాల్లో ఈ సీజన్‌లో 93వేల ఎకరాల్లో రైతులు పత్తి పంట సాగు చేశారు. అప్పులు తెచ్చి అధిక పెట్టుబడులు పెట్టినప్పటికి ఆశించిన స్థాయిలో దిగుబడి రాలేదని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. అధిక వర్షాలు, పూత, కాత వచ్చే సమయంలో వర్షాలు తగ్గుముఖం పట్టడం వంటి వివిధ కారణాలతో దిగుబడులు తగ్గాయని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. ఎకరానికి కనీసం 6 నుంచి 8 క్వింటాళ్ల వరకు దిగుబడి రావాల్సి ఉండగా.. 4 క్వింటాళ్లు కూడా రాలేని పరిస్థితి నెలకొంది. ఇదిలా ఉంటే ప్రస్తుతం క్వింటాకు మద్దతు ధర రూ.6,970 ఉంది. సకాలంలో పత్తి కొనుగోళ్లు పూర్తి కాకపోవడంతో ధర తగ్గితే మరింత నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

నిబంధనల మేరకు కొనుగోళ్లు చేస్తున్నాం..
కంటే శేఖర్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి

జిల్లాలో ఉన్న మూడు సీసీఐ కేంద్రాల్లో నిబంధనల మేరకు పత్తి కొనుగోళ్లు చేస్తున్నాం. ఇప్పటి వరకు 1,12,463 క్వింటాళ్ల పత్తి కొనుగోలు జరిగింది. అయితే, మిల్లుల్లో పత్తి నిల్వలు పేరుకపోవడంతో తాత్కాలికంగా కొనుగోళ్లు నిలిపివేశాం. వారంలోగా మళ్లీ కొనుగోళ్ల ప్రక్రియ జరుగుతుంది. గ్రామాల్లో అనుమతులు లేకుండా దళారులు పత్తి కొనుగోళ్లు చేసి రైతులను మోసం చేస్తే చర్యలు తీసుకుంటాం.

సీఎంఆర్ వసూలు కష్టమే..!

● చేతులెత్తేసిన మిల్లర్లు ● నోటీసులిచ్చిన అధికారులు

భూపాలపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 2 : భూపాలపల్లి జిల్లాలో కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) చెల్లింపుల్లో రైస్ మిల్లర్లు మీనమేశాలు లెక్కిస్తున్నారు. నిబంధనల ప్రకారం ప్రభుత్వానికి చెల్లించాల్సిన సీఎంఆర్ చెల్లించక పోవడంతో అధికారులు చర్యలకు దిగారు. 2022-23 వానాకాలం సీజన్‌కు సంబంధించిన సీఎంఆర్‌ను గడువు లోపు చెల్లించలేక పోయిన ఐదుగురు మిల్లర్లకు సివిల్ సప్లై డీఎం రాఘవేందర్ శుక్రవారం నోటీసులు జారీ చేశారు. చెల్లించాల్సిన సీఎంఆర్‌కు బాధ్యులు బకాయిపడ్డ మొత్తం డబ్బులు చెల్లించాలని, లేనిపక్షంలో క్రిమినల్ చర్యలకు దిగుతామని నోటీసుల్లో హెచ్చరించారు.

2022-23 వానాకాలం సీజన్‌కు సంబంధించిన 82,300 మెట్రిక్ టన్నుల వరి ధాన్యంను జిల్లాలోని 26 మిల్లులకు అధికారులు సరఫరా చేశారు. మిల్లులకు కేటాయించిన ధాన్యంను మర ఆడించి 67 శాతం బియ్యం(54,427 మెట్రిక్ టన్నులు)ను ఎఫ్‌సీఐకి అందించాల్సి ఉంటుంది. ఇందులో 98 శాతం సీఎంఆర్‌ను మిల్లర్లు చెల్లించారు. 26 మిల్లర్లలో 21 మంది మిల్లర్లు సీఎంఆర్ అందిస్తే ఐదుగురు మిల్లర్లు ఇంకా 1,053.252 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ ప్రభుత్వానికి బాకీ పడ్డారు. సువర్ణలక్ష్మి శ్రీనివాస ట్రేడర్స్ 368.297 మెట్రిక్ టన్నులు, రుద్ర రైస్ మిల్లు 318 మెట్రిక్ టన్నులు, వాగ్దేవి ఇండస్ట్రీస్ 198 మెట్రిక్ టన్నులు, ఆదిత్య ట్రేడర్స్ 132 మెట్రిక్ టన్నులు, హరిహర ట్రేడర్స్ 35 మెట్రిక్ టన్నుల సీఎంఆర్‌ను చెల్లించాల్సి ఉంది.

సీఎంఆర్ బకాయి కారణంగా 2023 వానాకాలం ధాన్యంను ఈ మిల్లులకు కేటాయించలేదు. బాకీ పడిన మిల్లుల్లో కొన్ని మిల్లులు సీఎంఆర్ చెల్లించకపోగా కనీసం డబ్బులు కూడా చెల్లించలేని స్థితిలో ఉన్నాయి. ముఖ్యంగా కాటారంకు చెందిన ప్రజాప్రతినిధి నిర్వహిస్తున్న మిల్లు పరిస్థితి దారుణంగా ఉన్నట్లు సమాచారం. దాదాపు రూ.3 కోట్ల విలువైన ధాన్యంకు సంబంధించిన సీఎంఆర్ చెల్లించాల్సి ఉంటుంది. మిల్లును వేలం వేసినా అందులో 10 శాతం కూడా వచ్చే పరిస్థితి లేదని అధికారులు అనుకుంటున్నారు. వానాకాలం ధాన్యం కేటాయించ లేదని బీఆర్ఎస్ ముఖ్య నేత కాబోయే సీఎంగా ప్రచారం పొందిన నాయకుడితో జిల్లా ఉన్నతాధికారులకు ఫోన్ చేయించి ధాన్యం కేటాయించాలని ఒత్తిడి తెచ్చినా సదరు మిల్లర్లు సీఆర్ఎం చెల్లించడంలో మాత్రం పూర్తిగా చేతులెత్తేసినట్లు తెలుస్తోంది.

కాలువ కబ్జా చేసి దర్జాగా వెంచర్

» అక్రమిత భూమిని పరిశీలించిన అధికారులు



బొంబగట్టు మాటు కాలువ ఆక్రమణలను పరిశీలిస్తున్న అధికారులు

భూపాలపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 2 : జిల్లా కేంద్రంలో చెరువులు, పంట కాలువలు యథేచ్ఛగా అన్యాక్రాంతం అవుతున్నాయి. చెరువు శిఖం, పంట కాలువలను దర్జాగా కబ్జాచేసి అక్రమార్కులు వెంచర్లు వేస్తున్నారు. భూపాలపల్లి పట్టణంలోని భాస్కర్‌గడ్డ డబుల్‌బెడ్ రూం ఇండ్ల సమీపంలోని బొంబగట్టు మాటు కాలువను ఆక్రమణదారులు ఆక్రమించి వెంచర్ వేశారు. బొంబగట్టు మాటు కాలువ ఆక్రమణలకు గురైందని ఫిర్యాదులు వెల్లువెత్తడంతో శుక్రవారం నీటిపారుదల శాఖ భూపాలపల్లి డీఈ బసవప్రసాద్ ఆధ్వర్యంలో నీటిపారుదల, మునిసిపాలిటీ అధికారులు సర్వే చేసి మాటు కాలువ ఆక్రమణకు గురైందని గుర్తించారు. డీఈ బసవప్రసాద్ మాట్లాడుతూ మాటు కాలువను ఆక్రమించి వెంచర్ వేశారన్నారు. ఆక్రమణలను వెంటనే తొలగించాలని కబ్జాదారులకు నోటీసులు అందించనున్నట్లు తెలిపారు. లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల ఏఈ షరీఫొద్దీన్, మునిసిపాలిటీ టౌన్ ప్లానింగ్ అధికారి సునీల్ తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

» రూ.3.12 లక్షల విలువైన ఆస్తి నష్టం



కాలిపోయిన ఇంటిని చూపుతున్న కుటుంబ సభ్యులు

మంగపేట, ఫిబ్రవరి 2: మండలంలోని రాజుపేట గ్రామంలో గురువారం రాత్రి షార్ట్ సర్క్యూట్ కారణంగా ఓ పూరిల్లు పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనతో కుటుంబమంతా నిరాశ్రయులై వీధిన పడ్డారు. బాధిత కుటుంబసభ్యులు, గ్రామస్థులు తెలిపిన ప్రకారం.. రాజుపేటకు చెందిన మోదుగు రాములు- వెంకటరమణమ్మ దంపతులతో పాటు దివ్యాంగుడైన పెద్ద కుమారుడు గోపి, ఆయన ఇద్దరు పిల్లలు పూరింట్లో నివాసముంటూ టీ కొట్టు పెట్టుకున్నారు. గురువారం రాత్రి సుమారు 9 గంటల ప్రాంతంలో ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి. చిన్నారులు, చుట్టుపక్కల వారు కేకలు వేయడంతో ఊళ్లో ఉన్న కుటుంబ సభ్యులు వచ్చారు. చుట్టుపక్కల వారు, కుటుంబ సభ్యులు నీళ్లతో మంటలు ఆర్పేయడానికి ప్రయత్నించినా ఇల్లు పూర్తిగా కాలి బూడిదైంది. దీంతో కుటుంబీకులు ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా రూ.50వేల నగదు, రెండు బీరువాలు, కలర్ టీవీ, మూడు ఫ్యాన్లు, 12 క్వింటాళ్ల బియ్యం, తులం బంగారం, 10 తులాల వెండి, బ్యాంక్, ఆధార్ బుక్కులు, రేషన్ కార్డు, భూమి పట్టా పాస్‌బుక్కు, విలువైన వస్తువులు కాలి బూడిదయ్యాయి. దీంతో ఆ కుటుంబం వీధిన పడి బిక్కుబిక్కు మంటూ రాత్రంతా గడిపారు.

సంఘటన ప్రదేశాన్ని శుక్రవారం స్థానిక తహసీల్దార్ బైరి వీరస్వామి, ఆర్ఐ ఏసుపాదం పరిశీలించి పంచనామా చేసి నష్టం అంచనాను తెలుసుకున్నారు. మొత్తం రూ.3,12,500 విలువైన ఆస్తి నష్టం జరిగిందని అధికారులు తెలిపారు. బాధిత కుటుంబానికి 50 కిలోల బియ్యం అందజేసి, ప్రభుత్వం నుంచి రావాల్సిన ఆర్థిక సహాయాన్ని అందజేస్తామని తహసీల్దార్ వీరస్వామి, ఆర్ఐ ఏసుపాదం తెలిపారు. కాగా, బాధిత కుటుంబాన్ని జ్వాలా చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు శుక్రవారం పరామర్శించారు. రూ.5వేల నగదు, 50 కిలోల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ కోడెల నరేష్, సభ్యులు పాల్గొన్నారు. అలాగే బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. రూ.6వేల నగదు, క్వింటా బియ్యాన్ని బీఆర్ఎస్ నాయకుడు ఎడ్లపెల్లి నర్సింహరావు ఆధ్వర్యంలో అందజేశారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.